# రాధారాణి కలలు

రాధారాణికి ఇరవై ఏళ్ళు దాటినా పరికిణీల మీద మోజు తీరలేదు. తను నిరంతరం చదివేసే కథలూ నవలల్లో, చూసిన తెలుగు సినీమాల్లో కథానాయికలంతా పరికిణీ ఓణీల్లోనే అందంగా మెరిసిపోతుంటారు. కాని వున్నది ఒక్కటే చిన్నాడం పట్టుపరికిణి పైకి పాత నైలాన్ ఓణి తను జూనియర్ కాలేజిలో చేరినప్పుడు, వాయిదాల పద్ధతి మీద అమ్మ కొన్నవి. వాటిని చెంబు ఇస్త్రీ చేసి, తలగడ కింద భద్రంగా మడతలతో దాచి సాయంత్రం పోవాల్సిన పేరంటానికి తయారుగా పెట్టుకొన్నది.

ఆ పేటలో అన్నీ పెద్ద మేడలూ, కార్లు ముందు నిలిచే బంగళాలు. టెలివిజన్ సెట్లు, ఫ్రిజ్‌లూ, హోదాలు అందమైన ఆడవాళ్ళు, ముంగిట వెడల్పయిన పూలమళ్ళూ, పొడుగైన ఉదకమండలం చెట్లూ, పనివాళ్ళూ- ఆఇళ్ళ హంగులు. వాటి యజమానులు పెద్ద ఆధికార్లు, వ్యాపారస్తులు, కంట్రాక్టర్లూ హైకోర్టు లాయర్లూ, నర్సింగు హోమ్‌ల డాక్టర్లూ. అర్ధాంతరంగా నాన్నగారు రిటయిరు అయి సర్కారువారి యిల్లు గూడా ఖాళీచేసి నెలక్రితమే మారిన యీ కొత్త గారేజి యిల్లు కూడా రాధారాణికి, ఆ వీధిలోని లక్ష్మీనిలయాలైన భవంతుల్లాగానే అన్పిస్తున్నది. పప్పుకూ, వుప్పుకూ, కాఫీకి పంచదారకు అప్పులకొచ్చే వరస వరుసల పిన్నమ్మలూ, వదినెలూ, అప్పులిచ్చే దొడ్డమ్మలూ అత్తమ్మలూ, ఎవరూ లేకపోయినా కళ్ళకింపయిన దృశ్యాలెన్నో వున్నై.

అయితే కార్లల్లో వచ్చి పేరంటానికి పిలిచి, టెలిఫోన్లమీద ఆహ్వానాల్ని అందించే సంపన్నులెవరూ తమ వునికిని పట్టించుకోకపోవటం-రాధ కలలకు ఇబ్బంది కల్గించినా, ఇవ్వాళ వకీలు సోమసుందరంగారి భార్య తోటివాళ్ళనేమో తమను గూడా పేరంటానికి బొట్టుపెట్టినప్పుడు రాధ ఆశ్చర్యపోయింది.

తీరా పేరంటకానికిబయలుదేరుతూ-"అమ్మా-నువ్వు రావటంలేదా?" అని తల్లిని ప్రశ్నించింది. నిజానికి అమ్మ రావటం తన కిష్టంలేదు. ఆమెకు వంటి మీదిది, బండమీదిది ఒక్కటే మంచిచీరె. పేద ముత్తయిదువుల్ని ఎంత గౌర విస్తారో తనకూ తెలుసు. వనితా సాహిత్యం నిండా ఆ కబుర్లేగదా.

"నాకు ఓపిక లేదులే. అత్తయ్యను తీసికెళ్ళు-" అని నీరసపడుతూ అమ్మ సమాధానం యిచ్చింది.

అత్తయ్యంటే మేనత్త. నాన్న చిన్న చెల్లెలు. భర్త దేశాలమీదపోయాడు. ఎకరం పొలంమీద ధాన్యం అమ్మి ఐవేజుపంపుతుంటారు అత్తింటివారు. తమతో పాటు కాలం వెళ్ళబుచ్చుతున్నది. నాన్నలాగే స్ఫురద్రూపం ఆమెది. సన్నని కోటేరువేసిన ముక్కు చేరడేసి కళ్ళు పసిమిఛాయ. తనది ఆమె పోలికే. ఆమె ఎకరా పొలం తదనంతరం తమకే చెందుతుందని అమ్మ భ్రమ. ఆమెకు విక్రయహక్కు లేదర్రా-అని నాన్న అంటున్నా ఎవరూ వినిపించుకోలేదు. ఈ ఆశతో అమ్మకూ అత్తయ్యకూ పొరపొచ్చాలు లేవు. నాన్న పింఛను పుచ్చుకొని అకాలంగావచ్చే వుబ్బసంతో వెతలుపడుతూ, నిశ్శబ్దంగా యింట్లో వరండా మూలపడుకొని పెళ్ళికాని తనను చూస్తూ కుమిలి కుమిలి కంటనీరు పెట్టుకొన్నప్పుడల్లా అత్తయ్య ధైర్యంతోఅనే మాటలు అందరికీ అమృతోపశమనాలు:

"దాని కేమిరా, చుక్కల్లో చంద్రుడు. చేసుకొన్నవాడు అదృష్ట జాతకుడు. పెట్టి పుట్టినింట్లో కాలు మోపుతుంది-" నాన్నకు ధైర్యంచెబుతూనే అత్తయ్య పట్టుచీరె కట్టుకొని తనతో బయలుదేరింది.

లాయర్ సోమసుందరంగారిది రెండతస్తులమేడ. కింద హాలులో పెద్ద పెద్ద తివాసీలు, పైన పంకాలు, గోడకానించి మెత్త కుర్చీలు, గోడలరంగుతో కలిసిన సోఫాలు, లోపల కాలుబెట్టగానే మంచుగుహలో ప్రవేశించినట్లుయి- "ఏమిటే ఇంత చల్లగావుంది?" అని అత్తయ్య ఆశ్చర్యం.

"ఏర్‌కండిషనర్లత్తా-" అని తను చెప్పింది.

లాయరుగారికి ఒక్కతే ఒకకుమార్తె. అల్లుడు అమెరికాలో లక్షలు సంపాదిస్తున్న ఇంజనీరట. వచ్చేవారం కూతుర్నిగూడా ఆ దేశం పంపుతు

న్నారు. ఈ పేరంటం అందుకే. ఆ పిల్ల నేస్తాలూ జడ్జీలభార్యలు, వకీళ్ళ మరదళ్ళూ బంధువులూ-ఇంద్రసభలో గాంధర్వ కన్యలు వేదికముందు తీర్చి దిద్దినట్లుంది. రాధ యీడుపిల్లలు-జుబ్బాలు, కుర్తాలు, లుంగీలు, జీన్సు-తనలాగా ఒక్కరికి పరికిణి ఓణీగాని, కనీసం చీరెగాని లేదు. తెలుగుభాష రానట్లే అంతా డిస్కోసంభాషణ. తెలుగుసినిమాలు చూసిన ముఖాలు కాదు. మెక్సికో పూసల వాళ్ళలాగా రకరకాల పూసలు రుద్రాక్షలు-బొడ్డుదాకా వేళ్ళాడేవి. తనూ, తన మట్టిగాజులూ, రోల్డుగోల్డు గొలుసూ-వాళ్ళలో కలిసినట్లుగా వున్నా, నిమిషనిమిషానికీ రకరకాల స్వీట్లూ, అయిస్క్రీములూ, కూల్‌డ్రింకులూ అందుతున్నా-తెలిసిన ముఖం ఒక్కటీ లేదు.

ఒక్కరూ పలరించకపోయినా, పక్కనున్న వాళ్ళు మర్యాదకు చిరునవ్వులు చిందిస్తూనే వున్నారు. ఆడపిల్లలు పాటలు పాడుకున్నారు. హిందీవి, యింగ్లీషువి పాటలూ, చప్పట్లూ, లైట్ల మధ్య మెరుస్తున్న డైమండ్ నెక్‌లేసులూ నగలూ వేలమీద మాటలే అమ్మలక్కలందరూ. ఇన్నేళ్ళుగా చదివి మాత్రమే వూహించుకొన్న దృశ్యాల నిజస్వరూపం అది.

ఇంతలో హాలు తలుపులు తెరచుకొని, రాజసం వుట్టిపడుతున్న ఒక ముత్తయిదువ ప్రవేశించింది. సోమసుందరంగారి భార్య, ఇంకా అంగనా మణులెందరో హడావిడిగా ఆమెకు ఎదురు వెళ్ళారు."సంగమేశంగారి భార్య-సంగమేశంగారి భార్య"-అని హాలంతా గుప్పుమంది. సూర్యరశ్మి నెరుగని శచీదేవి వలె వున్నదామె-బంగారు జలతారుతో కాంతులీనుతున్న పట్టుచీరె, రవ్వల నగలు, రాళ్ళ వడ్డానం. మెరుస్తూన్న కళ్ళజోడు. ముగ్ధగానూ వుంది ముత్తయిదువుగానూ వుంది. ఆమె చుట్టూ అంతమంది గుమిగూడి పలకరించటం చూస్తే ఈ పేరంటం సంరంభ మంతా ఆమెకోసమేనా అనిపించింది రాధకు.

కళ్ళార్పకుండా అటే చూస్తూన్న తనను - సోమసుందరంగారి తల్లి కాబోలు-ఆమెగూడా నెరసినజుట్టుకు రంగు వేసుకొన్నది - భుజం తట్టి తన వేపుకు తిప్పుకొని ఆప్యాయంగా అంటున్నది "ఒక్క మంగళహారతి పాట పాడు తల్లీ" తననే ఎందు కడిగిందో? ఈ జీన్ల అడవిలో తులిసి మొక్కలాగా తను కన్పించిందా? రాధారాణికి తన అందంతో పాటు తన గొంతు మాధుర్యం గూడా తెలుసు. గళం విప్పి ఏ పాటనైనా అనుకరించి ఒక్కక్షణంలో ఈ హాలునంతా నిశ్శబ్దంలో చలనరహితంగా చేయగలననే ధైర్యంతో శంకరాభరణం చిత్రంలోని "సామజ-వరగమనా" అందుకొన్నది.

యమునాతటిలో అలనాడు విరహ వేదనతో గోపకన్య రాధ తన క్రిష్ణుణ్ణి ఎంత ఆర్ద్రంగా స్మరించుకొన్నదో అంత హృద్యంగమంగా ఆలాపించింది. కాన్వెంటు చదువుల కిచకిచ, డిస్కోలు లాంగ్ ప్లేయింగురికార్డులు ఒక్కనిమేషం ఆగి అందరూ అనిమేషితులైనట్లుగా అన్నివందల కళ్లు తనవైపు తిప్పుకొని- తనే ఆ రాధగా ఆరాధనా దైవంగా హాలు మధ్య నిలిచింది. అందరి కళ్ళూ తన మీదున్నా తనవి ఆ-శచీదేవిమీద. అత్తయ్య గర్వంతో పూగిపోతూ ఆనందబాష్పాలు తుడుచుకుంటూ, తన ఓణి వదలకుండానే రెండవ చేత్తో సున్నితంగా తాళంవేస్తున్నది.

పాట అయిపోతుండగానే సంగమేశంగారి భార్య దగ్గిరగా వచ్చి ఆనందంతో ఎగాదిగా పరికించి, అత్తయ్యతో— "మీ అమ్మాయేనా?" అంటున్నది.

"మేనగోడలమ్మా" అన్న అత్త సమాధానం, చల్లనిపానీయం తాగుతూ తనూ విన్నది.

"సంబంధాలు వెతుకుతున్నారా?"

"కుదరవద్దు తల్లీ! ఈ రోజుల్లో, మనవాళ్ళకు ఎక్కడలేని ఆశలూ, నూచి వాతపెట్టుకొన్నట్టు. మగపిల్లవాడికి జుత్తుంటే చాలు— పదివేలు. జుత్తూ నోరూ వుంటే పదిహేనువేలు. అవి రెండూ వుండి మెటిక్లేషన్ అయిందనిపిస్తే యింకో అయిదు. మా కాలంలో నూటపదహార్లు లేదా వెండి చెంబూ పట్టుబట్టయా- అదే ఘనం" అని హుందాగా చెప్పుకుపోతున్నది అత్తయ్య.

పేరంటం సాగిన యింకో అరగంటవరకూ ఆమె ఎవరెవరితో మాట్లాడుతున్నా ఒక కంటితో తననూ అత్తయ్యనూ గమనిస్తూనే వుండటం రాధ కనిపెడుతూనే వుంది. ముత్తయిదువులు గుంపులు గుంపులుగా బయలుదేరుతూ బయటకు వచ్చినప్పుడు అన్ని కార్లు చూసి ఒక్కసారి స్తబ్దుగా నిలబడిపోయి "ఎన్నికార్లే?" అంటున్నది అత్తయ్య. అప్పుడే ఆమె రావటం, డ్రైవరు కారు తలుపులు తెరిచి గౌరవంగా పట్టుకోవటం-''ఎక్కండి మీ ఇంట్లో దింపుతాను"- అని సంగమేశంగారి భార్య తననూ, అత్తయ్యనూ చేతులు పట్టుకొని కార్లో తన పక్కనే కూచోపెట్టుకోవటం తను కన్న కలల లాగానే జరిగిపోయింది. పోతూపోతూ కారు మలుపు తిరుగుతున్నప్పుడు— ''రేపు మీకు తీరుతుందా? కారు పంపిస్తాను మా ఇంటికి రండి'' అని అత్తను ఆహ్వానించింది.

ఆరాత్రికి రాత్రే కనకమ్మత్త సంగమేశంగారి భోగట్టా సేకరించుకొని వచ్చింది- ప్రభంజనంలాగా తలుపులు తోసుకొని ''వాళ్ళు లక్షాధికారులు

కాదురా, కోటికి పడగెత్తిన వాళ్ళు. హైదారాబాదులో ఫాక్టరీలు, బెంగుళూరులో కార్ఖానాలు, బొంబాయిలో వ్యాపారం. అన్నీ వున్నమ్మ అణిగి మణిగే వుంటుంది. ఆమె పేరు పార్వతి, ఆయన పరమేశ్వరుడూ- సంగమేశ్వరస్వామి. ఎంతవినయం, ఏమి నమ్రత! ఏమీ లేనమ్మేగదా ఎగిరెగిరి పడేది? కలిసి వచ్చిందంటే రాదుట్రా మరి ఆ మహాతల్లికి?''

అత్తమాటల్ని నాదస్వరం వింటూ మత్తులో తేలిపోతున్న నాగుబాము వలె ఆలకిస్తున్న రాధారాణికి అన్నయ్యా వచ్చి, తన వెనకనే నిలబడి, అత్తను చూస్తూ వెకిలి చిరునవ్వుతో పుల్లవిరుగుడు సంభాషణ ప్రారంభించడం తెలియదు. ''వాడూ, వాడి నక్సలైట్ మాటలూ ఈ నిరుద్యోగ పర్వం ముగియందే- మారవులే"- అని అత్తకొట్టి పారేస్తుంది. ఒక తల్లి కడుపున పుట్టిన బిడ్డలైనా నాన్నగారికి అంత ధైర్యం లేదు. తను అర్థాంతరంగా రిటయిరు అయిన నాటి నుంచీ, అన్నయ్యా నూటిపోట్లకూ, యిన్నేళ్ళు సముపార్జించిన తన అవమాన పరంపరల మూట నుండి అమ్మ పంచుతున్న భాషాగ్నికి- ఆయన కాలిపోతూనే వున్నాడు. తనకు వుద్యోగం లేదు. సంపాదన అసలే లేదు. కాని తన కలల రంగురంగులకాంతిలో నాన్నను సుఖపెట్టేది తనొక్కతే నని రాధ ధీమాగా అనుకోని క్షణం లేదు. అన్నయ్యా వాగుతున్నా, నాన్న ఓపికున్న నాడు కాలికి బలపం కట్టుకొని వుద్యోగం కోసం కంపెనీల చుట్టూ తిరుగుతున్నా, అత్తయ్యలాగానే తనూ ఎప్పుడూ దిగులుపడలేదు.

''పచ్చడి మెతుకులు, చారునీళ్లూ, నీళ్ళమజ్జిగ- మీ గతి యింతేనర్రా. తుపాకి గొట్టం నుంచిగాని స్వాతంత్ర్యం రాదని చెప్తే మీకర్థమౌతుందా? ఆ కాపిటలిష్టు తొత్తుల మాటలు ఈ యింట్లో మాట్లాడకండి. పగటికలలు మానండి. మీకీ భావదాస్యం వదిలేందుకు యింకో శతాబ్దం రావాలే'' అని తన స్నేహితులముందే అందరిమీదా విరుచుకు పడ్తున్నాడు.

ఎవరేమి విరుచుకుపడ్డా, మర్నాడు పెద్ద విదేశీకారు రానూ వచ్చింది. అత్తయ్య సంగమేశంగారింటికి వెళ్ళనూ వెళ్ళింది. తిరిగిరావటం మాత్రం సాయంత్రందాటి చీకటి పడ్తుండగా మళ్ళీ ఆ కారులోనే. డ్రైవరు రెండు పెద్ద పళ్ళ బుట్టలూ బొంబాయివాలా మిఠాయిపాకెట్లూ గడపముందు పెట్టి సలాం కొట్టి పోతూండగా, చెంపంత కళ్ళు చేసుకొని, చేతిలో పట్టుచీరె సంచీ పట్టుకుని ఆనందార్భాటాలతో అత్త లోపలికివచ్చి- ''కాసినిచల్లనీళ్ళివ్వండర్రా'' అంటూ చతికిలపడ్డది.

"పైవాడు మన యందున్నాడే, కనకదుర్గ కనికరించకపోతే మనకీ అదృష్టం పడ్తుందా? పచ్చడిమెతుకులు తింటేనేం? నీళ్ళమజ్జిగ తాగితేనేం? మన రాధముందు ఆ యిద్దరు కోడళ్లూ బలాదూర్. ముగ్గురు కొడుకుల్లో పెద్ద వాడికి, చిన్నవాడికి వివాహాలు జరిగిపోయాయ్, మధ్య పిల్లాడికే మంచి చక్కని చుక్కకోసం వెతుకుతున్నారు. మన రాధ వాళ్ళకు నచ్చింది. మేడమెట్లు దిగివస్తూంటే పిల్లవాణ్ణి చూశాను.నలకూబరుడంటే నమ్ము. ఒడ్డుకుతగ్గ పొడుగు. తల్లిఛాయ. మనం-వూఁ అనటం తరవాయి దమ్మిడి ఖర్చులేదు. అది భవంతికాదే వైకుంఠపురం. ఏమి దర్జా, ఏమి సుఖం?''

అమ్మ వూపిరిపీల్చుకొని- ''వాళ్లతో మనం తూగగలమా కనకమ్మా" అని మాత్రం చూపు తిప్పుకొని అన్నది.

"ఉభయ ఖర్చులూ వాళ్లవే వదినా! లక్ష్మీదేవి వంటి కోడలు కావాలి ఆ యిల్లాలికి. అంతే" అని తేల్చిపారేసింది అత్త. ఆ రాత్రి ఆమె పక్కన తన్ను అక్కున చేర్చుకుని- "సంబంధం సెటిల్ చేసుకొచ్చానే పిచ్చిమొఖమా" అని తనకు పెట్టిన పట్టుచీరెవిప్పి చూపించింది అత్తయ్య.ఆరాత్రి ఎవరికి నిద్దర్లు పట్టాయో ఏమోగాని రాధారాణికి భళ్ళున తెల్లవారింది. మరి అతను తన్ను చూడక్కర్లేదా? తను నచ్చుతుందా?

రాధారాణి సందేహాలు హోటల్ అశోకాలో జరిగిన విందులో తీరపో యాయి. సంగమేశంగారి కుటుంబం వాళ్ల మేనమామట ఆయన, తామూ. పిల్ల వాడు అత్తయ్య వర్ణనలకంటే, తను వూహించిన దానికంటే, ఆరోగ్యం వుట్టిపడుతూన్న తెల్లని ఆజాను బాహువు. తల్లికళ్ళు, తండ్రి వుంగరాల జుట్టూ, సూర్యకుమారి నవల్లోగాని, సులోచనారాణి సినిమాల్లోగాని అంత అందగాణ్ణి తానిదివరలో చూడలేదు. చేతుల్లేని జాకెట్టుతో, కిందనుంచి పైదాకా మూసబోసిన తనాబీగా వున్న పెద్దకోడలు, సిబ్బిముఖంతో, గోగుపుల్లకు చీరెచుట్టినట్లుగా వున్న చుంచు మూతి చిన్న కోడలితో-తనను చూడకుండానే ముసిముసి నవ్వులు అందించుకొంటున్నా, తనను ఆప్యాయంగా పలకరించ కున్నా, పార్వతిదేవి ఒకపక్కన, కాబోయే భర్త ఒక పక్కనా తన లక్ష్మీ స్వరూపానికి జనమేజయులుగా వున్నందున రాధకు అవమానమూతోచలేదు. వాళ్లకున్న హక్కులు తనకూరాబోతున్నవని ఈ తోడికోడళ్ళే గ్రహిస్తారు- అని పై పెచ్చు నిబ్బరంగా అనుకొంది.

పెళ్ళి ముహూర్తం పది రోజులుందనగానే, అన్నయ్యకు వుద్యోగం వచ్చింది. సంగమేశంగారి విశాఖపట్నం బ్రాంచిలో అసిస్టెంటు మేనేజరు.

గుడ్డలకు, యితర ఖర్చులకు అన్నయ్యకు మూడువేలిచ్చి పంపేశారు. పెళ్ళి నాటికి మాత్రం విమానంలో రమ్మని ముందుగానే టిక్కెట్టు గూడా తీసిచ్చారు. హైద్రాబాదులో ఫ్యాక్టరీ దగ్గరే నాన్నకు అయిదు గదుల బంగళా యిచ్చారు. నాన్నగారిప్పుడు వాళ్ళ ఎకౌంట్స్ సెక్షన్‌లో పెద్ద హోదాగల అధికారి. ఆయన ఉబ్బసం ఎగిరిపోయి మళ్ళీ నవజవాన్‌లాగా నడుస్తున్నారు. ఇంట్లో టెలిఫోనూ, నౌకర్లూ, సిబ్బందీ. అన్నయ్య ఎప్పుడు బడితే అప్పుడే నాన్నగారితో టెలిఫోనులో మాట్లాడతాడు.

హోటల్ అశోకాలో రాధారాణి - రంజితరావుల వివాహం బ్రహ్మాండంగా జరిపించారు. పైన రూఫ్ గార్డెన్‌లో పందిరి. కిందనున్న రెండు హాళ్ళల్లో రిసెప్షన్, పోలీసు సిబ్బంది కాపలా. మూడు రకాల బ్యాండ్లు, మూడు లారీల బహుమతులు, మూడువేలమంది ఆహూతులు. వెయ్యికి పైగా శుభ సందేశాల టెలిగ్రాములు. రాధారాణికి యిప్పుడు ఈ కార్లు,యీ ధనవంతుల పరిచయాలు, వెల కట్టలేని నగల తళుకులు, అతిలోక సుందరీ మణుల్లాగా తనతో చేతులు కలుపుతూన్న యువతుల చిరునవ్వులూ ఏవీ సంభ్రమాశ్చర్యాలు కలిగించలేకపోయాయి. తన అందంతో అన్నీ జయించగలనని ఎన్నడో అనుకొన్న కల నిజ స్వరూపం ఈ వివాహం అనుకొన్నది. రంజిత్‌రావుతో మధ్య మధ్య మాటలు కలుపుతున్నది. ఒకమ్మాయి - "మీ డాడీది ఏ ఇండస్ట్రీ!" అని ప్రశ్నించినప్పుడు అతని వంక చూసింది. అన్నిటికీ చిరునవ్వే అతని సమాధానంగా తోచింది. ఆ అమ్మాయి డాడీ ఒక కంపెనీలో పెద్ద డైరెక్టరు. పెళ్ళికి వచ్చిన పెద్దల్లో సగం మందికి పైగా కంపెనీ డైరెక్టర్లే అని - తెలుసుకొంది సూటుతో దిగిన అన్నయ్యనుంచి రాధ. ఈ పరిశ్రమాధిపతులందరికీ ఎంత దగ్గర సంబంధాలుంటాయో, తను చదివిన సాహిత్యంలో, తనెరిగిన కల్పనా జగత్తులో మచ్చుకైనా తగల్లేదు.

ఆ రాత్రికిగాని రాధారాణికి తన స్వప్నాకాశంలో చంద్రుడు పూర్ణుడు కాదనీ, తన చేతిరేఖల్లో వక్రరేఖ బలంగా వుందనీ - తెలియరాలేదు. తోడికోడళ్ళ అనూహ్య మందహాసాలకు అర్థం యిదని అప్పుడు తోచింది. నిశిరేయిదాకా మూడో అంతస్థు పడక గదిలో తన పంకనే చూస్తూ చిన్నగా నవ్వుతూ తన కోమలహస్తాల్ని తాకుతూ రంజితరావు కూర్చొనేవున్నాడు. తెల్లవారుఝామున తను నిద్రకు వుపక్రమిస్తూండగా చెవిలో వూదాడు. "నాకు చిన్నప్పుడు చెట్టుమీదినుంచి పడ్డ పాటుతో నడుము దెబ్బతిన్నది - రాధా.

ఇంకా మందులు తింటూనే వున్నాను. నువ్వు ఓపికపట్టాలి. ఈ సంగతి యింకెవరికీ తెలీగూడదు. నీకేం కావలసినా నన్ను అడుగు. మనిద్దరి పేర బ్యాంకులో జాయింటు ఎకౌంటు వున్నది. ఇదిగో చెక్కు బుక్. ఇది మన డబ్బు, నీ ఖర్చుల్ని గురించి ఎవరూ ప్రశ్నించరు."

చెక్కు పుస్తకం తలగడ క్రింద దాస్తూ, కొంచం నిదానించి కళ్ళ నీళ్ళు తెచ్చుకోకుండా అడిగింది.

"మరి నన్నెందుకు చేసుకొన్నారు?"

"పిచ్చిపిల్లా, నేను పది కంపెనీల్లో డైరెక్టర్ని. మన వ్యాపారాలికి పరిశ్రమలకూ హోదా వుండాలి. హోదా వుండాలంటే నీవంటి జగదేక సుందరి పక్కన వుండాలి. మనం యింకో ఆరు నెలల్లో యూరప్ వెళ్ళాలి తెలిసిందా?" అని రంజిత్ అన్నాడు.

రాధ ఏమీ మాట్లాడలేదు మౌనంగా వుండిపోయింది. అతను పక్కనే వున్న స్నానాల గదికి లేచిపోతున్నప్పుడు తువాలు అందించబోయింది. కాని బాత్‌రూమ్‌లో నాలుగు మెత్తనివి- తనెప్పుడూ చూడనివి గీజర్ కిందనే వేళ్ళాడుతూ కన్పించాయి.

*　　*　　*

రాధారాణికిప్పుడు తీరికలేని పని. తన బజారు పనులకూ, క్లబ్బుకూ ప్రత్యేకంగా కారు. ఇంట్లో దాదాపు నిరంతరమూ ఏదో ఒక డిన్నరు పార్టీ. బిజినెస్ అధిపతులూ, ఇతర డైరెక్టర్లూ వాళ్ళ భార్యల్తో వస్తూనే వుంటారు. డిన్నరు తర్వాత బ్రిడ్జి ఆట. ఇంట్లో డిన్నర్లు లేకపోతే ఏ క్లబ్బులోనో ఎవరి ఆహ్వానం మీదనో పోయి తీరాలి. మధ్యాహ్నంపూట కాలక్షేపానికి వెనకటి రోజుల్లోవలె అద్దె లైబ్రరీలకని వీధిన పడనక్కర్లేదు. మూడో అంతస్తునుంచి ఫోనుచేస్తే సరి తన అభిమాన నవలలూ, కొత్తవీ, పాతవీ, యింకా సినిమా మాగజైన్లూ రంగు రంగుల ఇంగ్లీషు, తెలుగు జర్నల్సూ కావలసినన్ని వచ్చి పడతాయ్.

కొత్త వాళ్ళని వాళ్ళ హోదానుబట్టి ఎట్లా పలకరించడమో నేర్చుకొన్నది. తోడికోడళ్ళ మందహాసాలకు ఒక్క కరకు చూపుతోనే సమాధానం చెబుతుంది. అత్తగారు అప్పుడప్పుడు "మీ అత్తయ్యను రమ్మని ఫోను చెయ్యి రాధా" అంటుంది. మామగారు - "ఏం తల్లీ మీ నాన్నగారి కులాసా కనుక్కొంటున్నావా?" అని అడుగుతారు. తనే కల్పించుకొని అన్నయ్యనిప్పుడు -

విశాఖ బ్రాంచి మేనేజరుగా వేయించింది. అక్కకూ, ఆమె పిల్లలకూ కోరిన గుడ్డలూ, వస్తువులూ పంపుతుంది.

ఒక రాత్రి ఏదో డిన్నరుకు వెళ్ళి వస్తూ రంజిత్‌రావును అడిగింది. "మనం జర్మనీ పోయేదెప్పుడు?"

"ఒక్క జర్మనీయేనా? పారిస్, లండన్, వియన్నా, రోమ్ అన్నీ వెళ్తాం".

"అది కాదండి. జర్మనీలో మంచి డాక్టర్లు వుంటారటగా"

"అవును. అందుకేగా మనం వెళ్ళటం. వ్యాపారం ప్లస్ ట్రీట్‌మెంట్" అని ముద్దుగా సమాధానమిచ్చాడు అతను. తను చదివిన నవల్లో నాయకుడు యిట్లాంటి సమాధానమే ఇచ్చాడని జ్ఞాపకం వచ్చింది రాధకు. జర్మనీలోనూ, వియన్నాలోనూ గొప్పగొప్ప డాక్టర్లు వైద్యశాస్త్రవేత్తలు వుంటారని గూడా చదివింది.

యూరప్ ప్రోగ్రాం సెటిల్ కాగానే రాధారాణి తన అభిమాన రచయితల పుస్తకాలన్నీ మొదట సూట్‌కేసులో చేర్చుకొన్నది. కొత్త కలలతో, కొత్త దేశాలకి ప్రయాణం. ఏ నగరంలో, ఏ హోటల్లో తమకు రిజర్వేషన్లు జరిగాయో, ఆ రాత్రి రంజిత్‌రావు తనకు వచ్చిన టెలెక్సులన్నీ చూపి వివరంగా చెబుతున్నాడు. మర్నాడే రాధారాణి ప్రయాణం. ○

(స్వాతి మాసపత్రిక - జూన్ 83)